కథ

# కొడుకెళ్లిపోయిండు...

బోధనం నర్సిరెడ్డి

“ఏమన్నా! కొడుకెళ్లిపోయ్యిండట గదనే! ఇగ నీ దరిద్రం బొయ్యింది పో!” నిన్ననే కొడుకు స్వరూప్ స్టడీ వీసా మీద యుఎస్‌కు వోయిండు. సాగనంపొచ్చిన సత్యనారాయన్ని ఎస్‌జి కాలేజీ బస్టాపుల తోటి ఉపాధ్యాయ మిత్రుడు ఉపేందర్ పల్కరిచ్చిండు. సత్యనారాయణకు కొడుకుతో పాటు ఒక కూతురు. కూతురు బెంగుళూర్‌ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగంల ఉన్నది.





''ఏం దరిద్రం బోవడమే ఉప్పన్నా! ఎయిడ్ దొరకలేదు. ఎడ్యుకేషన్‌లోన్ కోసమని రొన్నెళ్లనించి బ్యాంకుల సుట్టూ దిరిగి తాడుదెగె. ఆడు సదివి సంపాయిచ్చేనెప్పుడోగని ఆరేడు లక్షలకు అప్పుజేస్తి'' నిట్టూర్చినట్లు జెప్పిండు సత్యనారాయణ.

''అమ్మా! అంతయినాదే! నిరుడు మన గిరిగాని కొడుకు బొయినప్పుడు నిండ రొండుగూడ కర్సుగా లేదన్నడు'' అడిగిండు ఉపేందర్.

''నిజమే! ఆ పిలగానికి జిఆర్ఈ స్కోర్ బాగుందట'' ఐ.ట్వంటీ వచ్చినప్పుడే ఎయిడ్ మంజూరయింది. ఇప్పుడు అమెరికాల గూడ పరిస్థితులేం బాగలేవట. యూనివర్సిటీలకు ఫండ్ బాగా తగ్గించిండ్రట. నిన్న మొన్న బోయిన పోరలకు ఎవ్వరికి ఎయిడ్ దొరకడం లేదు. ఆడికి బొయినంక ఏదన్న పనిజూస్కొని ఎల్లదీస్కోవలసిందే'' సత్యనారాయణ వివరించిండు.

''ఏందే! అట్టమాట్లాడ్తవ్? మునేడు మన అనంతం కొడుకు బోయెగా! ఆడు యాడాది తిరుగక ముందే ఈని అప్పంత తీర్చిండట. ఎయిడ్ దొరికిందట! పార్ట్‌టైం జాబ్ గూడ జేస్తున్నడట పోరడు! ఇప్పుడు అనంతం స్కూటర్ దీసేసి 'హోండాషైన్' గొన్నడు. మొన్ననే కొడుకొచ్చిండు. బిడ్డకు సారె బోశి చిన్న ఫంక్షన్ జేసి అందర్ని బిలిశిండు. నేను గూడ బొయ్యొచ్చిన. నీకు జెప్పలే?'' ఉపేందర్ అడిగిండు.

''జెప్పిండు. ఫోన్ జేశిండు గాని నాకే తీరలే. ఇప్పుడే జెప్తుంటిని గద! పిలగాని పంపితాలకు తల పానం తోకలకొచ్చె. ఆ బ్యాంకోడు తిప్పి తిప్పి నాలుగు లక్షలిచ్చిండు. ఇంకో రొండు మూడు బయటప్పులైనై. నెలనెలా మిత్తే పదివెయిలయితట్టుంది. పోరగాళ్లు ఆడికి బొయినంక ఏమన్న కిందుమీదయ్యిరా మన మెడకే పట్టుకుంటది'' అన్నడు సత్యనారాయణ.

''ఏందే సత్తెన్న! లెస్స భయపడుతున్నవ్? ఒక్కొక్కడు ఊరిచ్చుకుంట ముచ్చటజెప్తుంటే? మా ఓడు థర్డ్ ఇయర్ బిటెక్‌ల వుండెగా! జిఆర్ఈకి ప్రిపేరయితుండు. రేపుసండే నేను నీ దగ్గరికే ఒద్దామనుకుంటున్న. అసలు పంపనే ఒద్దంటెట్టుండిగా నువు సూడబోతె.'' కారెద్దమాడినట్టు మాట్లాడిండు ఉపేందర్.

కొడుకు అమెరికా బొయినందుకు సంబూరంగ ముచ్చటజెప్పక సత్యనారాయణ రివర్స్‌ల మాట్లాడితాలకు ఆయనకు జర ఆశ్చర్యంగున్నది.

''అదేం లేదులేవే ఉప్పన్నా! ఎయిడూ, స్కాలర్‌షిప్పుల మీద మటుకు హోప్ పెట్టుకోవద్దు. మొత్తం ఖర్చు మనం భరించగల్గితేనే పంపాలె. అదీ సంగతి.''

అంటుండంగనే బస్సొచ్చింది.

''అన్నా! నా బస్సొచ్చింది. నేంబోతనే! సండే గలుస్త. జర పుర్సతుగ మ్లాడుకుందాం!'' ఉపేందర్ మందిలగల్సి బస్సుల దూరిండు. బస్సెల్లిపోయింది.

కొడుకు బొయ్యి నెలరోజులపైపే అయ్యింది. అక్కడేదో డిపార్ట్‌మెంటల్ స్టోర్‌ల, కాలేజీ లైబ్రరీల రోజూ మూడునాలుగ్గంటలు పని దొరికిందట. ఆని కర్సులు ఆనికెల్తున్నన్నయ్‌గాని స్కాలర్‌షిప్ రాకపోతే మటకు మళ్లీ సెమిస్టరుకు మళ్లీ అప్పుజెయ్యాల్సిందే.

ఆలోచిస్తున్నడు సత్యనారాయణ.

పోయినేడు ఆళ్ల హెడ్‌మాస్టరు కొడుకు టెక్సాస్ బొయిండు. ఆనిగ్గూడ ఐ.ట్వంటీ వచ్చినప్పుడే ఎయిడ్ మంజూరయింది. ఆడు సదవుకుంటనే తండ్రికి పైసలు పంపుతున్నడు. తనకే ఎటమటమైతట్టున్నది.

''హలో! సత్యనారాయణ సాబ్! బస్సెక్కవా, ఏమో ఎటో సూస్తున్నవ్?''

తనకన్న ముందు స్టాప్ పెదకొపర్తిల దిగుతడు పురుషోత్తం రెడ్డి. బస్సుల్నించి కేకేసినట్టు పిలిశిండు. బస్సెప్పుడొచ్చి ఆగిందో తను సూడనేలేదు. అందరు ఎక్కుతున్నరు. తనూ గబగబ ఎక్కిండు సత్యనారాయణ. సీట్లు బస్టాండ్లనే నిండినట్టుంది. అప్పుడే స్టాండింగున్నరు జనం.

''రండి రండి ఈ సీటు మీద టూబైత్రీ కూసుందాం! ఈ సారు చర్లపల్లికాడ దిగుతడట!'' పురుషోత్తంరెడ్డి పిలిశిండు.

అది నల్లగొండ, హైద్రాబాద్ ఆర్డనరీ బస్సు. ఎప్పుడూ సీట్ల మందం గూడ వుండరు జనం. ఇయ్యాళ జర లేటయినట్టుంది. బస్టాండ్లనే నిలబడ్డరు. పురుషోత్తం రెడ్డి జరుగంగనే ఇద్దరు సీటు మీద సర్దుకొన్నరు. మూడో వ్యక్తి కొంచెం కూడా జరగలే. ముగ్గురికి ఇబ్బందిగనే వున్నది.

''బాబు బైటికి పోయిండట గద సార్! ఎంఎస్‌ఏనా? హెచ్‌ఒన్ వీసానా?'' అడిగిండు పురుషోత్తంరెడ్డి.

''లేదన్నా! స్టడీ వీసానే! జనమర్లో జాతర మర్లో అని పోరలు ఎగబడి పోతున్నరు గని అక్కడికి బొయ్యి ఈళ్లు సెటిలయితాలకు టైం బానే పడితట్టున్నది. మనలాంటి మిడిల్ క్లాసోళ్లకు ఇది మొయ్యలేని బరువే!'' చెప్పిండు సత్యనారాయణ.

''అట్టంటరేంది సార్! పిల్లలు బైటకి బోంగనే ఒక్కొక్కరు నోరూరితట్టు ముచ్చట జెప్తుంటే?''

''ఏమో సార్ అందరి సంగతి నాకేందెల్సుగని మావొన్ని ఫస్ట్ సెమిస్టర్ల జేర్చితాలకే నాకు ఉన్న శక్తులన్ని ఉడిగిపోయినై. మళ్ల పెట్టుబడి పెట్టాల్నంటె బ్యాంకోడియ్యకపొతె బ్యాకెళ్లిరావాల్సిదే''అన్నడు.

చర్లపల్లి స్టేజొచ్చినట్టుంది. బస్సాగింది. సీటు మీది మూడోవ్యక్తి లేచి దిగిపోయిండు. ఇద్దరు జరిగి ఫ్రీగ కూసున్నరు.

''ఒస్తవా అన్న! ముగ్గురం కూసుందాం!పురుషోత్తం రెడ్డి నిలబడి వున్న ఓ లావుపాటి మిత్రునికి మర్యాదజేశిండు.

అమ్మో! ఒద్దులే పురుషోత్తం! నేను గూసుంటే మీరిద్దరు నిలబడాల్సొస్తది. నాతిప్పలు నేను బడ్తగాని కంగ్రాట్స్ సత్తెన్నా! బాబు ఫైటెక్కిచ్చినవంటగా?'' నిల్సున్న మిత్రుడు అడిగిండు.

నవ్వి ఊరుకున్నడు సత్యనారాయణ.

కండక్టరు టిక్కట్లు కొట్టుకుంట జనాన్ని నెట్టుకొస్తుంటె మిత్రుడు ఎనక్కు జరిగిండు.

''బాబు బొయ్యి అక్కడ ఎక్కడ వుంటున్నడు సార్? హాస్టలా? రూం దీసుకున్నడా?'' అడిగిండు పురుషోత్తంరెడ్డి.

''ఏమున్నదని పురుషోత్తం బాయ్! మనం చిన్నప్పుడు ఉళ్లల్లనించొచ్చి నల్లగొండల వండుకు తినుకుంట

సదువుకొలే! అక్కడ వాళ్ల పరిస్థితి గూడ గిప్పుడు గట్నే ఉన్నది. ముగ్గురు, నల్గురు పిల్లలు గలిశి ఓ అపార్టుమెంటు దీసుకున్నరు. వంట జేస్కోని తింటున్నరు. ఈనించి బోతప్పుడు పప్పు, పచ్చళ్లు, కారం ఓ సంవత్సరానికి సరిపోతట్టు కట్టి పంపింద్రు. బియ్యం కూరగాయలు మటుకు అక్కడ కొనుక్కుంటున్నరు. కాకపోతె అప్పట్ల మనం వారం వారం ఊళ్లకు పోయెచ్చేది. ఇప్పుడు వీళ్లేమో విమానాల మీద యాడాదికి, ఆర్నెళ్లకు మటుకే వచ్చిపోతరు. అంతే తేడా'' వివరించిండు సత్యనారాయణ.

''ఏంది సార్! ఎంత సింపుల్‌గా జెప్తిరి. నకిరెకల్లు నించి నల్లగొండకొచ్చింది, ఆమనగల్లు నించి అమెరికా బొయ్యింది రొండొక్కటం జేస్తిరి.'' నవ్వుకుంట అన్నడు పురుషోత్తంరెడ్డి.

ఇంతల ఆయన స్టాపొచ్చింది. దిగిపొయిండు. తర్వాత స్టాపుల సత్యనారాయయణ దిగిండు. స్కూళ్ల ఆరోజంతా ఆయనకు కొడుకును గురించిన ఆలోచనలే.

★ ★ ★

'కోదాడనించి శ్రీరాములు వాళ్లు ఫోన్ జేశింద్రు' సాయంత్రం ఇంటికి బోంగనే భార్య సునంద చెప్పింది సత్యనారాయణతోటి.

'ఏంటట సంగతులు?' అడిగిండు.

''సంగతులు కాదు. ఆళ్ల సుధీర్ ఇరవై రోజుల్నించి ఫోన్ జెయ్యలేదంట! ఆళ్లు భయపడుతున్నరు. మన స్వరూప్ ఫోన్ జేశిండేమోనని అడిగింద్రు.''

''నిన్ననేగా మనోడు ఫోన్ జేశింది! సుధీర్‌ను గురించి గూడ అడిగితివిగా! చెప్పలే?''

''చెప్పిన గాని నిన్న నేనడిగినప్పుడు మనోడు గూడ ఏదో దీర్ఘందీసినట్లు మాట్లాడిండు. ఇప్పుడు నాగ్గూడ అనుమానమొస్తున్నది. అక్కడ ఆపిలగానికి ఏదో అయినట్టే వుంది'' అనుమానం వ్యక్తం చేసింది సునంద.

ఆమెకు భయం అనేకం. కొడుకు ఫోన్ జేశినప్పుడల్ల భోజనం గురించి సగం, జాగ్రత్తల గురించి సగం టైము తీస్కొని మాట్లాడుతుంది.

సత్యనారాయణ సెల్ నించి కొడుకు నెంబర్‌కి ఫోన్ చేసిండు. వెంటనే కలిసింది.

''హలో చిన్నా! బాగున్నార్రా ఏం జేస్తున్నవ్?''

..... ..... .....

''ఆс మేం బానే ఉన్నంగని సుధీర్ ఉన్నడా? మాట్లాడమను ఒకసారి''

.... .... .....

''బయటికెక్కడికెళ్లిండు? ఇరవై రోజుల్నించి ఇంటికి ఫోన్ చెయ్యలేదట? ఆళ్లు మాట్లాడినప్పుడు కలుస్తలేడట! నువ్వు గూడ మాకు జెప్తలేవు. ఏమైందసలు?'' ఆత్రంగ అడిగిండు.

..... .... .....

''ఏందీ! యాక్సిడెంటయ్యిందా? ఎట్టున్నడిప్పుడు? ఎన్ని రోజులయ్యింది? స్పృహలోనే వుండా అసలు? ఇన్ని రోజుల్నించి మాకు జెప్పలేదేందిరా? ఏమైనా గింతేనా?'' సత్యనారాయణ గొంతుల భయం ధ్వనించింది.

''అయ్యో! ఏమైంది? యాక్సిడెంటెక్కడిది? ఎవ రెవరికి తగిల్నయంట దెబ్బలు! అసలిప్పుడెట్లున్న డంట? అక్కడ ఎవ్వరు దిక్కు ఈళ్లకు? ఎందుకొచ్చిన సదువులు? ఏదో ఇక్కడ దొరికిన ఉద్యోగం జేస్కొని ఉండర్రా అంటే ఇనర్రైరి.''

సునంద గొంతుల దుఃఖం మొదలైంది. కొడుకు ఎదురుగానే ఉన్నట్టు అరుస్తూ మాట్లాడుతున్నది. సత్యనారాయణ ఆగమన్నట్టు చెయితోటి సైగ జేశిండు. ఫోన్ లౌడ్ స్పీకరు ఆన్‌జేశిండు. స్వరూప్ జెప్తున్నడు.

''భయమేం లేదు డాడీ! మమ్మిని ఊకోమను! మేజరు యాక్సిడెంటే గాని ఇప్పుడు బాగనే ఉన్నడు. మాకాలేజీ సర్కిల్ కాన్నే రోడ్డు దాటుతుంటె కారు గుద్దింది. అప్పుడు సుధీర్ ఒక్కడే వున్నడు. మాగ్గూడ పోలీసులు ఇన్‌ఫర్‌మేషనిస్తేనే తెలిసింది.''

''అరేరే! ఇప్పుడెట్లున్నడు? సీరియస్సేం లేదుగా?''

''ఏం లేదు డాడీ! ట్రీట్‌మెంటు మంచిగనే దొరు కుతున్నది. హెడ్ ఇంజూరేం లేదుగాని కుడికాలు ఫాక్చరైంది.దౌడపండ్లు కొద్దిగ కదిల్నయంట.''

''దౌడ కదిలితె హెడ్ ఇంజూర్ కాదంటవేందిరా! మూతి ఏమన్న వంకర బొయినట్టయిందా? మాట మంచిగొస్తున్నదా? అసలు మాట్లాడుతున్నడా? ఇప్పుడు?''

''ఆс ఆс... మాట్లాడుతున్నడు. ఇప్పుడు బానే వున్నడు. హాస్పిట్ నించి నిన్ననే ఒచ్చినం. కాలు ఆపరేషనయ్యింది. స్టీల్ రాడ్సేశింద్రు. కట్టు ఇప్పలే. ఈ కట్టు ఇడ్సినంతరువాత పండ్లు సెట్ జేస్తమన్నరు.''

''హాస్పిటల్ ఖర్చులన్నిటికి డబ్బులెక్కడివిరా? కారోడు దొరికిండా అసలు?''

''లేదు డాడీ! వాడు ఎస్కేపయ్యిండు. వాడు దొరికితెనా? మా సదువుల ఖర్చులకు సరిపొయ్యేటంత ఎక్స్‌గ్రేషియో వసూలయ్యేది.''

''ఇప్పుడెట్లమరి.''

''అబ్రాడ్ స్టూడెంట్లు ఇక్కడి రాంగనే ఇన్సూరెన్స్ జేస్తరు. వాళ్లే భరిస్తరిప్పుడు. లేకపోతె మనతోని యాడైతది? నలభై యాభై లక్షలైతది బిల్లు.''

''సరేగని సుధీర్‌ని మాట్లాడమను.''

''వాడు ఇప్పుడే లేచిండు. ఇందాక మీరడిగినప్పుడు నిదురబోతుండె. ఇదో ఇస్తున్న మాట్లాడండి.''

అక్కడ ఫోన్ సుధీర్‌కిచ్చిండు.

''హలో సుధీర్! ఎట్లున్నవ్? ఇంతపెద్ద యాక్సి డెంటయితే ఇంటికి గూడ ఫోన్ జెయ్యలే! మాకు గింత గూడ జెప్పలే! అక్కడ అమ్మనాయ్నలెంత పరెశానయి తున్నరు తెల్సా?''

''హలో అంకుల్! అందుకనే మేం ఫోన్ జెయ్యంది! సీరియస్సేంలేదన్నరు. తగ్గినంక చెప్పొచ్చులే అనుకున్నం. నేను ఇంతకుముందే ఇంటికి ఫోన్ జేశిన.''

''అమెరికాల యాక్సిడెంట్లు తక్కువైతయంటరు! నువ్వు నడిచేపోతుంటివి. అసలు యాక్సిడెంటెట్ల య్యిందయ్యా?''

''ఎందుగ్గాదంకుల్? అయితనే వుంటయిగాని యాక్సిడెంటయినంక సేఫ్ గావడమే లక్.''

''సెంటర్ల కెమెరాలుంటయంటగా! వెహికల్‌ని ట్రేస్ జెయ్యలేకపోయింద్రా?''

'కెమెరాలుంటయ్‌గాని మన బ్యాడ్‌లక్. ఈ సర్కిల్‌లోనే కెమెరాలు లేవు. కారు ఎట్ల ఒచ్చి తగిలిందో నాకు గుర్తేలేదు. పోలీసులే హాస్పిటల్ల చేర్పింద్రు. పది గంటలకు యాక్సిడెంటయితే సాయంత్రందాక స్పృహరాలే. స్పృహలోకొచ్చినంక స్వరూప్ వాళ్ల నెంబరిచ్చిన. అప్పటిదాక వాళ్లగ్గూడ దెల్వదు.''

''ఎట్లనయ్యా బాబూ! దేశం గాని దేశంల జాగ్రత్త గుండాలె గాని! ఇంటికాడ మీవోళ్లు ఏడుస్తున్నరంట! ఓసారి ఆంటీతోని మాట్లాడు.''

ఫోన్ భార్యకిచ్చిండు.

''హలోసుధీర్! ఎట్లున్నవ్?''

''కొంచెం నొప్పులున్నయాంటీ! నేను ఇంతకు ముందే మమ్మీ డాడీతోటి మాట్లాడిన. ఏడుస్తున్నరు లెస్స! జర మీరే చెప్పురి ఆంటీ. నేను బాగానే ఉన్నా నని. ఇంకో పదిరోజుల్లో కాలేజీకి పోవచ్చునన్నారు.

''సరే నేను మాట్లాడ్తగాని జర జాగ్రత్తగుండు మరి!'' ఫోన్ ఆపుజేసి ఏడుపు మొదలుపెట్టింది సునంద.

''ఎక్కడి సదువులో! ఎక్కడి ఉజ్యోగాలో! తల్లికి పిల్లగాకుంట, పిల్లకు తల్లిగాకుంట! ఆళ్ల సదువుకు ఈడ దొరకవా ఉద్యోగాలు? ఉండమంటే ఉండరయిరి'' ముక్కు చీది తుడుచుకున్నది సునంద.

''ఎందుకేడుస్తవ్ సునందా! మనమేం జేస్తం చెప్పు?



ఇక్కడ ఉంటెమటుకు కావా యాక్సిడెంట్లు? అయినా రోజులు మారినయి. తల్లిదండ్రులు పిల్లలు ఒక్కకాడ వుండేరోజులు కావు. మనమీ నల్లగొండల్నే ఉంటిమి. మా అమ్మానాయ్నబొయినప్పుడు చివరి చూపుకు నోచుకోమైతిమి.'' ఓదార్చినట్లు మాట్లాడిండు.

★ ★ ★

రెండేండ్లు గడిచినై. సుధీర్, స్వరూప్ రెండు మూడుసార్లు ఇండియాకు వచ్చిపోయిండ్రు. యుఎస్‌లనే ఉద్యోగంల చేరి రీసర్చ్ చేస్తున్నరు. ఆర్నెల్లయితన్నది. కొడుకుదీ, కూతురిదీ రెండు పెండిండ్లు ఒక్కసారే చేసిండు సత్యనారాయణ. కొడుకు, కోడలు అమెరికాల్నే సెటిలయితట్టుంది. ప్రస్తుతం వర్జీనియా స్టేట్ల ఉన్నరు. తండ్రి సంవత్సరీకానికి కొడుకూ, అతని స్నేహితులు వచ్చిను. అందు కూసోని మాట్లాడు కుంటున్నరు.

''అప్పుడెప్పుడో పేపర్లో జూసినం. ఒకడు ఉన్మాదంతోటి ముప్పైరెండు మందిని కాల్చి తానూ కాల్చుకోని సచ్చిండు మీ వర్జీనియాల్నే కదురా?'' కొడుకుని, అతని మిత్రుల్ని ఉద్దేశించి అడిగిండు సత్యనారాయణ.

''ఔనంకుల్! మేముండే స్టేటే గాని మా యూనివర్సిటీగాదు''సుధీర్ చెప్పిండు.

''నొప్పులు, రోగాలు లేవు. రోడ్డు ప్రమాదాలు లేవు. వీళ్లకు తిన్నదరగ సంపుకోవడమే పెద్ద రోగమైనట్టుంది'' అన్నడు సత్యనారాయణ.

''అదంతా ఒక చరిత్రా సంస్కృతీలేని సమాజం అంకుల్! అందరూ హృదయంలేని యంత్రాలే అనిపిస్తరు మనకు. చిన్న తిరస్కారాన్ని గూడ సయించలేరు. సింగిల్ బీరు కోసం దగ్గరి స్నేహితుల్ని కాల్చి చంపిన సంఘటనలున్నై. తెల్లోడైనా, నల్లోడైనా మన భారతీయుల హృదయ వైశాల్యంలో వందో వంతుకైనా సరిపోరు.'' సుధీర్ వివరించినట్లు చెప్పిండు.

''నిజమే సుధీర్! మాకు తల్చుకుంటేనే భయమైతది. మీరు ఇంకా అక్కడ ఉండాల్సిన అవసరమేముంది? ఇండియాకు వచ్చెయ్యరాదురి! ఆంటీ మొదట్నుంచీ అదే ఏడుపు. స్వరూప్ పట్టించుకోవడం లేదు'' అన్నడు.

''ఏంటంకుల్! మీరుగూడ ఇట్ల మాట్లాడ్తరు? ఏవో చిన్న చిన్న రేర్ ఇన్సిడెంట్స్‌ని తల్చుకొని భయపడ్తమా? ఇవ్వాళ మన దగ్గర గూడ ఆడపిల్లలు దేశమంత తిరిగి ఉద్యోగాలు చేస్తున్నరు. బయట దేశాలకు పోతున్నరు. మీ చిన్నప్పుడు ఇదంత కనీసం ఊహించిండ్రా చెప్పండి. మనం అడ్జస్టు కావాల్సిందే గాని పారిపోలేం గద! మీరే జెప్తుంటరు అప్పుడప్పుడు సర్దుబాటే జీవితమని'' సుధీర్ అన్నడు.

''ఔన్లే గని. మా భయం మాకుంటది. మీరు మటుకు జాగ్రత్తగుండాలె వాళ్ల సుద్దికి బోకుంట.''

''సుద్దికి బోవాల్నా అంకుల్! ఒక్కొక్కడు డ్రగ్స్ తీస్కోని ఏం జేస్తున్నరో తెల్వకుంట వుంటరు. రోడ్డు మీద ఎప్పుడు యాక్సిడెంట్ అయితదో మనకు తెలుస్తదా ఇదీ అంతే! అని సరిపెట్టుకోవాలె.''

''అక్కడి ప్రభుత్వం పట్టించకోదా? అసలు ఏంజేస్తరు అక్కడి పోలీసులు? పోస్టుమార్టమ్‌లు, పంచనామాలు తప్ప ప్రివెంటివ్ యాక్షన్స్ వుండవా?''

''ఎందుకుండవంకుల్? ఒక్కోక్కసారి షూట్ చేసి కూడా చంపుతరు. కాని మళ్లీ తయారైతరు. మీకు తెల్వందేముంది?''

''అంతేలే! దినదిన గండం నూరేళ్లయూష్షు. సరిగని నేను వెళ్లి భోజనాల ఏర్పాటు జూస్త. మీర రడీగండి'' సత్యనారాయణ వెళ్లిపోయిండు.

ఆ తర్వాత రెండు మూడు రోజులుండి కొడుకు, కోడలు, కొడుకు స్నేహితులు అందరు గలిశి యూఎస్ వెళ్లిపోయిండ్రు.

★ ★ ★

ఒక్కొక్కసారి మనం దేన్ని గురించైతె ఎక్కువ భయపడుతుంటమో ఆ భయపడ్డ సంఘటన భయపడ్డట్టె మనకే ఎదురైతది.

సత్యనారాయణ దంపతులు భయపడ్డట్టే యూఎస్‌ల సుధీర్, స్వరూప్‌ల మీద ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపిండ్రని ఓరోజు అమెరికా నించి ఫోనొచ్చింది. ఏంజెయ్యాల్నో కాలూ, చెయ్యీ ఆడడంలేదు సత్యనారాయణకు. ఈ వార్త విన్న సునంద కొడుకు చనిపోయిండని శోకాలు ప్రారంభించింది. దగ్గరి మిత్రులకు, బంధువులకు ఫోన్ చేసిండు సత్యనారాయణ. కాసేపట్లోనే ఇల్లంత గోలగోలగా తయారైంది. వచ్చిన వాళ్లకు వాళ్లను ఎలా ఓదార్చాలో తెలియడం లేదు. అసలేం జరిగిందో కూడా పూర్తిగా ఎవరికీ తెలియదాయె.

సత్యనారాయణ మిత్రుడు ఉపేందర్ వచ్చిండు.

''ఏవన్నా? ఏం జరిగిందే?'' ఆదుర్దాగా అడిగిండు.

''వివరాలేం తెలియవ్ ఉపేందర్! సుధీర్ అపార్ట్‌మెంట్లో దూరి దుండగులెవరో కాల్పులు జరిపిండ్రంట. ఆ టైంల అపార్ట్‌మెంట్ల ఇద్దరే ఉన్నరంట. ఇద్దరికీ చాలా బుల్లెట్లు తగిల్నయని అమ్మాయి ఫోన్ జేశింది. ఏడుకుంట ఏం చెప్పలేకపోతున్నది'' చెప్పిండు సత్యనారాయణ.

''ఇద్దరు చనిపోయినట్లే. అక్కడి పేపర్లల్ల అప్పుడే న్యూసొచ్చిందంట. యూఎస్ నించి మా అల్లుడు ఫోన్ చేశిండు'' సత్యనారాయణ వినకుండ ఉపేందర్ తోటి అన్నడు వచ్చిన మిత్రులెవరో.

''వాళ్ల డిపార్ట్‌మెంట్ల వీళ్ల మీద అసూయ ఉన్నోళ్లెవరో ఈ కాల్పులు జరిపిండ్రంట'' మళ్లీ ఆ మిత్రుడే అన్నడు.

''అన్నా! మనమిప్పుడు యూఎస్‌కు పోయి రావాల్సిందే గద!'' అన్నడు ఉపేందర్.

''పోయి రావాల్సిందేమరి! పిల్లలు అయ్యేపోయిండ్రట! డెడ్‌బాడీస్ తెచ్చుకోవడానికి ఎన్నిరోజులు పడుతుందో ఏమో!''అన్నడు మిత్రుడు.

ఏడ్పులు, గగ్గోలు మధ్యనే ఏర్పాట్లు చేసుకున్నరు. తెల్లారే భారతీయ పత్రికలన్ని పిల్లల మరణవార్తను పతాక శీర్షికన ప్రచురించినై. సునంద మతి భ్రమించిన దాన్లా మారిపోయి స్పృహదప్పింది. వాళ్లని సముదాయించడం ఎవరితరం గావడం లేదు.

సత్యనారాయణతోపాటు దగ్గరి బంధువులు ఇద్దరుముగ్గురు యూఎస్ వెళ్లిండ్రు. మరో రెండురోజులకు గాని శవాలు ఇండియాకు రాలేదు. సునందను ఆసుపత్రిలో చేర్పించిండ్రు. శవాలను చూసి కూడా ఆమె గుర్తించే స్థితిలో లేదు. అంత్యక్రియల సమయంలో కొత్త వధువు దుఃఖం హృదయవిదారకంగా వుంది. అక్కడ శ్రీరాములు కుటుంబం పరిస్థితి ఎట్ల ఉన్నదో ఏమో!

నల్లగొండ నుంచి సత్యనారాయణ స్వగ్రామం ముషంపల్లి దాక తెలిసిన జనం బారులు గట్టి వెళ్లిండ్రు. సుట్టు నాలుగు నూర్ల జనం తిర్నాల పర్మలాగా పోగైండ్రు.

చితికాడ సత్యనారాయణను ఉపేందర్ పొదివి పట్టుకొన్నడు. నిప్పంటించినాక దూరం తీసికెళ్లిండు.

''అన్నా! ఊకోవే!'' అనడం తప్ప ఎలా ఓదార్చాలో అతనికి తెలియడం లేదు.

''ఉప్పన్నా! ఇందుకగానె! నేను ఇన్ని బాదలు పడ్డది? కొడుకెళ్లిపోయిండు. నాదరిద్రం బోతదంటివి! కాని నేను ఇంకింత దరిద్రున్నైతి గదనే! డబ్బుకు దరిద్రున్నైతె అప్పులు తెచ్చుకుందును గాని ఇప్పుడు కొడుకునేడ తెచ్చుకుందునే!'' అని భోరున ఏడుస్తూ కూలబడ్డడు.

(రంగు వర్ణాల మధ్య రక్తతబీభత్స ప్రపంచం అమెరికాలో అర్థాంతరంగా అసువులు బాసిన కిరణ్ కుమార్, చంద్రశేఖర్ లాంటి యువకుల రుధిర స్మృతికి)

★

